నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
మంగళవారం
29 అక్టోబరు
2024
పేజీలు 8
గుంటూరు
పల్నాడు



# పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీలు..!

డిసెంబరు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు..!

- ప్రణాళిక బద్ధంగా కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- అభివృద్ధికి తగ్గట్లు పెంపు. ఎక్కువగా ఉన్న చోట తగ్గింపు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో స్టాంప్ పేపర్లు
- విలువల పెంపుపై సమీక్షిస్తున్న అధికారులు
- సీఎం చంద్రబాబు వద్దకు చేరిన ఫైల్

భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రెవిన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం డిసెంబర్ 1 ఒకటి నుంచి ఈ పింపుల్లోకి వచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం కోసం ఫైల్ సిద్ధం చేశారు. రిజిస్ట్రేషన్ విలువల పెంపుపై ఎప్పటికీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కసరత్తు పూర్తి చేసి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సబ్ రిజిస్టార్లు భూముల విలువ పెంపుపై కేటగిరి వారిగా విలువలు నిర్ధారించి పక్కగా రికార్డ్ సిద్ధం చేసుకుని ఉంచుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వేలువడిన వెంటనే అమలులోకి వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.......

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

ఆస్తుల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్ విలువలను డిసెంబరు 1 నుంచి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి. చంద్రబాబు ఆమోదంతో అధికారిక ప్రకటన రానుంది. వైకాపా అసమర్ధ పాలన వల్ల కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్ విలువలు బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువగా ఉన్నాయి. దీనివల్ల స్థిరాస్తి రంగంలో స్తబ్ధత నెలకొంది. ఈ లోపాలు సరిదిద్ది.. స్థానిక అభివృద్ధి, ఇతర అంశాల ప్రతిపాదికన కొత్త విలువలను ప్రభుత్వం ఖరారు చేస్తుంది. జిల్లా సంయుక్త కలెక్టర్ స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి రిజిస్ట్రేషన్ విలువల తీరుపై రెండున్నర నెలల నుంచి రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కసరత్తు చేస్తోంది. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ సచివాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమై విలువల సవరణ కసరత్తు పురోగతిని సమీక్షించారు. దీనిపై

మిగతా 3లో..

# ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

## గుంటూరు జిల్లా కలెక్టర్ కె నాగలక్ష్మి ఆదేశం



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇస్తున్న అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ, డిఆర్ఓ పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, గంగరాజు, గుంటూరు ఆర్డిఓ కే.శ్రీనివాసరావు ప్రజల నుండి 211 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి సోమవారం గత సోమవారం అందిన అర్జీలపై సమీక్ష చేస్తామని , కనుక ప్రతి అర్జీ సమగ్ర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యమైన పరిష్కారానికి జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్ళి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం పెండింగ్ దరఖాస్తులను జిల్లా కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించడం జరిగింది. ఫిర్యాదుల పరిష్కారాన్ని నిర్ణీత గడువు లోపు ఎట్టి పరిస్తితుల్లోను పరిష్కరించాల్సి వుందని సూచించనప్పటికి ఎక్కువగా రెవెన్యూ , పంచాయితీ రాజ్ , జియంసి కి సంబంధించిన దరఖాస్తులు పెండింగ్ లో వున్నాయన్నారు. దరఖాస్తులను 24 గంటలు , 48 గంటల్లోపు పరిష్కరించాల్సిన వాటికి సంబంధించి ఎప్పటికప్పుడు శాఖల వారీగా వివరాలు ముందస్తుగా అందిస్తున్నప్పటికి వాటిని సకాలంలో పరిష్కరించకుండా పోవడం వల్ల బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళుతున్నాయని తెలిపారు. ఏ.పి సేవా పోర్టల్ లో బియాండ్ ఎస్ఎల్ఏ లో లేకుండా చూడాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్ళిన వాటిపై సంబంధిత అధికారి నుండి సంజాయిషీ కోరడం జరుగుతుందని తెలిపారు. సిటిజన్ సంతృప్తి జిల్లాలో 73 శాతంగా వుందన్నారు. పారిశుద్ధ్యం, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, డిపిఓ లకు సంబంధించిన అంశాలపై సిటిజన్ సంతృప్తి తక్కువగా వుందన్నారు. అలాగే ఫిర్యాదుల పరిష్కారం మరింత మెరుగ్గా నాణ్యతగా వుండాలన్నారు. సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ సమీక్షిస్తూ ఫిర్యాదుల పరిష్కారంలో సమయ పాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి ఇన్ టైమ్ లో కౌంటర్ దాఖలు చేయాలని, వకాలత్ లు ఫైల్ చేయాలన్నారు. అలాగే లోకా యుక్తా, ఎన్హెచ్ఆర్సి, నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ కాస్ట్, న్యూ ఢిల్లీ లో పెండింగ్ లో వున్న కేసులపై దృష్టి పెట్టాలన్నారు.

# అన్ని రంగాల్లో జిల్లాని అభివృద్ధి చేస్తాం

## జిల్లా ఇన్చార్జి మంత్రి కందుల దుర్గేష్, నాదెండ్ల వెల్లడి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** రాష్ట్రంలో కీలకమైన గుంటూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్ చార్జి మంత్రి , రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్ లోని మిని ఎస్ ఆర్ శంకరన్ హాలులో జిల్లా సమీక్షా కమిటీ సమావేశం అనంతరం జిల్లా ఇన్ చార్జి మంత్రి మరియు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ , రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తో కలసి విలేకరులతో మాటాడుతూ జిల్లాలోని సమస్యలపై డీఆర్సీ సమావేశంలో పూర్తిస్థాయిలో చర్చించామని, స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకొని మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో కలిసి, వారి సూచనలు పరిగణలోకి తీసుకొని జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రధానంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ పత్రం తయారీపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ప్రభుత్వ పాలసీకి

మిగతా 3లో..



## ప్రతిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు



గుంటూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి గా మొదటి సారి గుంటూరు విచ్చేసిన సాంస్కృతిక, పర్యాటక & సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ గారికి ఘన స్వాగతం పలికిన ప్రతిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వర రావు ప్రతిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు, మరియు అధికారులు, జనసేన నాయకులు, కూటమి నాయకులు.

## జిల్లాలో ఉత్తమశాఖ తెనాలి రెడ్ క్రాస్



**తెనాలి టౌన్ న్యూస్ :** 2023-24 సంవత్సరానికి జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థల్లో, ఉత్తమ ఉపశాఖ గా, తెనాలి ప్రతినిధులు గుర్తింపు పొందారు.అక్టోబర్ 26 తేదీన గుంటూరు లో జరిగిన సమావేశంలో,ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకోవటం జరిగింది. సోమవారం, తెనాలి రెడ్ క్రాస్, అధ్యక్షులు, సబ్ కలెక్టర్ ఐన, వి. సంజనసిన్హా ను కలిసి, అభినందనలు తెలిపిన, రెడ్ క్రాస్ ఛైర్ పర్సన్, ముమ్మనేని భానుమతి,వైస్ ఛైర్ పర్సన్ పీజి వెంకటేశ్వరరావు,ఈసీ సభ్యులు కొత్త కృష్ణకుమార్, మురళి, కుర్రా శ్రీను, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ మూర్తి, పాల్గొన్నారు.

## పట్టబద్రుల ఓటు నమోదు కార్యక్రమం



తాడికొండ, మేజర్ న్యూస్ : నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ గ్రామంలో రావి చెట్టు సెంటర్ వద్ద గుంటూరు,కృష్ణా జిల్లా పట్టబద్రుల ఓటు నమోదు కార్యక్రమం స్థానిక కూటమి నాయకులు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఓటు నమోదు కొరకు గ్రాడ్యుయేట్స్ చదువుకొని ఉన్నవారికి వారి ఆధార్ కార్డు ఓటు కార్డు ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో పాటు ఒక పాస్పోర్ట్ ఫోటో కూడా తీసుకొని వచ్చి ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా కోరినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ పట్టబద్రులు బాధ్యతాయుతమైన విద్యావంతులు గా పౌరసమాజాన్ని స్ఫూర్తి దాయకంగా నడుచుకోవాలి అని అభిలాషించారు ఓటరు నమోదుకు ప్రతి పట్టబద్రుడు ముందుకు వచ్చి నవంబర్ ఆరవ తేదీలోగా నమోదు చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధనేకుల హరిబాబు, చొప్పర యాకోబు, ఉండవల్లి రాజేష్, కొలికిపూడి శివ, షేక్ రఫీ, జిల్లా బిజెపి మైనార్టీ సెల్ మెంబర్ బిలాల్, చింతల లంక నాంచారయ్య, ఇదా రవి, నీరుకొండ పెద్దబ్బాయి, దనేకుల నాగేశ్వరరావు, కందుల రామారావు, కంతేట అంజయ్య, పెద్ది తిరుపతి రావు పాల్గొన్నారు.

# హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణా తరగతులు

గుంటూరు పార్లమెంట్ పరిధిలో హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్17 వ బ్యాచ్ శిక్షణ తరగతులను హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్, ప్రిన్సిపాల్ యస్.కె.అబ్దుల్ సలామ్ ప్రారంభించినారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏ.పి.యస్.ఆర్.టి.సి. హెవీ డ్రైవింగ్ స్కూల్ లో 25 సంవత్సరముల అనుభవం కలిగిన SDI లచే నాణ్యమైన శిక్షణను అందిస్తున్నామని తెలిపారు.శిక్షణ పొందే అభ్యర్థులు రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని, డ్రైవింగ్ చేసే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడరాదని, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు కలిగివుండాలని, శిక్షణ ఇచ్చే వారు చెప్పే ఇంధనం పొదుపు చేయు డ్రైవింగ్ అలవాట్లను అలవర్చుకొని తదనుగుణంగా ఇంధనం పొదుపు చేసి అధికారుల ప్రశంసలు పొందాలని పేర్కొన్నారు. డ్రైవింగ్ తరగతులకు ప్రతిరోజు హాజరై రోడ్డు భద్రత నియమములను నేర్చుకొని, డ్రైవింగ్ చేసే సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ ప్రమాద రహిత డ్రైవింగ్ చేయాలని, ఆర్.టి.సి. హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూల్ నందు శిక్షణ పొందడం హర్షించతగినదిగా వివరించారు. ప్రతిరోజు ఒక గంట వాహనం యొక్క వివిధ భాగాల గురించి వాటి పనితీరు గురించి, వివిధ రకాల రోడ్ల గురించి, రోడ్ల పైన ఉండే రోడ్డు సిగ్నల్ సూచీకల మార్క్ ల గురించి, రోడ్లకు సంబంధించిన సిగ్నల్ బోర్డుల ప్రాధాన్యత గురించి వివరించినారు. ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ ఎటువంటి ప్రమాదములు జరగకుండా చూసుకోవలసినదిగా పలు సూచనలు చేశారు. ఘాట్ రోడ్డునందు కూడా ఎటువంటి భయం లేకుండా నడుపుటకు శిక్షణ ఇస్తున్నట్టు హెవీ డ్రైవింగ్ శిక్షణ




పూర్తి చేసుకున్న అభ్యర్థులకు అనేక విధములుగా ఉద్యోగ అవకాశములు కలుగుచున్నవి అని, సదరు డ్రైవర్లు 108 వాహనములలో, ఏ.పి.యస్.ఆర్.టి.సి. లో ఆన్ కాల్ Call డ్రైవర్లుగా, హైర్ బస్ డ్రైవర్లుగా పనిచేయుచు కుటుంబ పోషణ చేసుకొనుటకు అవకాసాలున్నాయని స్పష్టం చేశారు.

# శిశిరం చిత్ర గోడపత్రిక ఆవిష్కరించిన మాజీమంత్రి ఆలపాటి రాజా



**తెనాలి మేజర్ న్యూస్:** శిశిరం చిత్రం పోస్టర్ ను, మాజీ మంత్రి ఆలపాటి రాజా సోమవారం గుంటూరు, లక్ష్మి పురం లోని తన కార్యాలయం లో ఆవిష్కరించారు. శ్రీ కృష్ణ ఆర్ట్స్ బ్యానర్ పై అమిరినేని వెంకట్ ప్రసాద్, సాదు చలపతి, కన్నెగంటి రవి, అనిల్ మూకిరి సహ నిర్మాతలు గా సీనియర్ జర్నలిస్టు, వరల్డ్ రికార్డు హోల్డర్ కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో శిశిరం నూతన చిత్రం రూపొందుతుంది. ఈ సందర్భం గా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రత్నాకర్ గతం లో వీరస్థలి తెనాలి అనే దేశభక్తి చిత్రాన్ని తెరకెక్కించి ప్రేక్షకుల మన్ననలను పొందారని, తెనాలి ప్రాంత జాతీయ స్ఫూర్తి, స్వాతంత్ర ఉద్యమం లో తెనాలి వాసుల కీర్తిని చాటారన్నారు. విద్యా వ్యవస్థ పై తీస్తున్న మరో చిత్రం శిశిరం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చిత్ర యూనిట్ కు అభినందనలు తెలిపారు. చైల్డ్ సూపర్ స్టార్, కేజీఎఫ్ ఫేమ్ మాస్టర్ భాను, మాస్టర్ పుష్కర్ , గోము , యామిని, వెంకట్, మధుకర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నట్లు దర్శకులు రత్నాకర్ తెలిపారు. కథ, స్క్రీన్ ప్లే వెంకట్ ప్రసాద్, పాటలు సురేంద్ర రొద్దా, ఆర్ట్ ఎం. వెంకట్, ప్రొడ్యూషన్ ఇంచార్జీ గా ఎం. శ్రీకాంత్ లు వ్యవహరిస్తున్నారని దర్శకులు తెలిపారు.

# ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి, జర్నలిస్టులు: మాజీ మంత్రి ఆలపాటి

**తెనాలి మేజర్ న్యూస్:** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా వ్యవహరిస్తున్న జర్నలిస్టుల పాత్ర సమాజంలో ఎంతో కీలకమని మాజీ మంత్రి, ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో, సోమవారం ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గ అభినందన సభలో మాజీ మంత్రి ఆలపాటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫెడరేషన్ అక్రెడిటేషన్ జర్నలిస్టుల హెల్త్ కార్డులకు ఆర్థిక సహకారం అందించిన ప్రముఖ రియల్టర్ నలజాల లోకేష్ ను ఫెడరేషన్ తరపున ఆలపాటిచేతులమీదిగా సత్కరించారు. కార్యక్రమం లో భాగం గా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన జిల్లా అధ్యక్షుడు కనపర్తి రత్నాకర్, కార్యవర్గ సభ్యులు మునిపల్లి శ్రీకాంత్, వేముల రాజేష్, పట్నాల సాయి కుమార్, వరదల మహేష్, కొండవీటి పుల్లారావు, పుట్ల పున్నయ్య, చింతా మణి కుమార్, అంబటి శ్యామ్ సాగర్, అచ్యుత సాంబశివరావు, బుర్రా సుధీర్, చల్లా రవి లను దుశ్శాలువా కప్పి అభినందించారు. అనంతరం ఆలపాటి మాట్లాడుతూ జర్నలిస్టుల హెల్త్ కార్డులకు నిధులను సమకూర్చిన లోకేష్ లాంటి వ్యక్తులు అవసరమన్నారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర సేవలు ఎంతో కీలకమన్నారు. చరిత్రలో వర్తమాన, భవిష్యత్ కాలమానాన్ని అక్షర రూపంలో ప్రజలకు అందించడానికి కృషి చేయాలన్నారు. వ్యక్తులకు ప్రాముఖ్యత కల్పించకుండా,



సమాజంలో జరిగే వాస్తవ ఘటనలపై సమగ్రమైన వార్త విశ్లేషణలను అందించినప్పుడే విలేకరులకు గుర్తింపు లభిస్తుందన్నారు. తప్పుడు కథనాలు, అసత్య ప్రసారాలు ద్వారా ఊదరగొట్టడం పాత్రికేయరంగానికే చెడ్డపేరన్నారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ జబీర్, ఫెడరేషన్ సభ్యులు మేకల సుబ్బారావు, ఉన్నం భూషణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూప రాణికి సన్మానం




**పెదకాకాని మేజర్ న్యూస్ :** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎస్పీ బాలసుబ్రమణ్యం స్కూల్ ఆఫ్ పర్ఫామెన్స్ అండ్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ విభాగములో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూప రాణి కి సన్మానం జరిగింది. ఈనెల 26 – 28 తేదీల్లో జరిగిన యువజన ఉత్సవాలలో థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ తరపున పాల్గొని వన్ యాక్ట్ ప్లే, స్కిట్, మైమ్ వంటి మూడు అంశాలలో మంచి ప్రదర్శనలు ఇచ్చి ప్రథమ బహుమతి పొందారు. విభాగాధిపతి గా ఉన్న స్వరూప రాణి విభాగం అభివృద్ధి కి అందిస్తున్న సహకారం పట్ల సిబ్బంది, విద్యార్థి కళాకారులు సన్మానం చేశారు. అనంతరం విద్యార్థులను అభినందించిన స్వరూప రాణి రానున్న కాలంలో మంచి ప్రదర్శన లిచ్చి బహుమతులు సంపాదించి విశ్వవిద్యాలయ ఖ్యాతిని పెంచాలని, ఇందుకు సంబంధించి అన్ని విషయాలలో సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. విద్యార్థుల ప్రతిభను, అంకిత భావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రంగస్థలం, సిని దర్శకులు, నటులు ప్రయోక్త అయినటువంటి ఎంఎస్ చౌదరిని ప్రత్యేకంగా అభినందించారు. థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ సంబంధించిన ఆచార్య ఎల్.వి నాగభూషణరావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థుల్ని వారి సేవలను నైపుణ్యాల్ని అభినందించారు.

## సమస్యలపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలి

**- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు**



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్ లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు సంబంధిత శాఖ అధికారులకు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను వినతి పత్రాల ద్వారా విన్నవించారు. పీజీఆర్ఎస్ లో 105 అర్జీలు నమోదయ్యాయి. పీజీఆర్ఎస్ పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు ఆదేశించారు. ఆన్ లైన్ లో వచ్చిన ప్రతి అర్జీని నిక్షిప్తం చేయాలన్నారు. 31వ తేదీన దీపావళి పండుగ నేపథ్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకానికి అవసరతను బట్టి ముందస్తుగానే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలన్నారు. ఒకటో తేదీన ఉదయం ఐదున్నర గంటలకి లబ్ధిదారులకు సచివాలయాల సిబ్బంది పింఛన్ నగదు పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న పల్నాడు జిల్లా కలెక్టర్

**సత్తెనపల్లికి చెందిన వికలాంగుడికి అడిగిన వెంటనే ట్రై సైకిల్ పంపిణీ**



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా కలెక్టరేట్ లో సత్తెనపల్లికి చెందిన బీరం లక్ష్మీనారాయణ అనే వికలాంగుడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబుకు తాను పొలం వెళ్లేందుకు మూడు చక్రాల బండి కావాలంటూ దరఖాస్తు చేసుకున్నాడు. వికలాంగుడి దరఖాస్తును స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు వెంటనే వికలాంగుడు వినతిని పరిగణలోకి తీసుకున్నారు. వెనువెంటనే మూడు చక్రాల బండిని తెప్పించి వికలాంగుడు కి ఇచ్చి పంపించారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే వికలాంగుడి వినతిని పరిష్కరించడం జరిగిందని వికలాంగుడు బీరం లక్ష్మీనారాయణ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు జిల్లా కలెక్టరే స్వయంగా తన వినతిని విని పరిష్కరించడం పట్ల తన సంతోషానికి అవధులు లేకుండా పోయాయని బీరం లక్ష్మీనారాయణ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## టపాసుల విక్రయాలకు రసీదులు ఇవ్వాలి

**ఆర్డీఓ రమణ కాంత్ రెడ్డి**



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** టపాసుల కొనుగోలుదారులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలంటూ రెవెన్యూ డివిజనల్ అధికారి రమణకాంత్ రెడ్డి టపాసుల విక్రయ నిర్వాహకులను ఆదేశించారు. ధూళిపాళ్ల గ్రామ పరిధిలోని విఘ్నేశ్వర ఫైర్ వర్క్స్ బాణా సంచా హోల్‌సేల్ దుకాణంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనతో పాటు మండల తహసీల్దార్ చక్రవర్తి ఉన్నారు. ఈ సందర్భంగా అన్ని రెన్యువల్స్‌తో పాటు, దుకాణ లైసెన్స్ లను పరిశీలించారు. అన్ని నియమ నిబంధన్లు పక్కాగా పాటించాలని, జనసమూహం ఉన్నపుడు తప్పక జాగ్రత్తలు తీసుకోవాలని, దుకాణ నిర్వహాదారుడికి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు రెవిన్యూ ఇన్స్పెక్టర్, సిబ్బంది ఉన్నారు.

## వంగవీటి మోహన్ రంగా విగ్రహం ధ్వంసం



**మాచవరం, మేజర్ న్యూస్ :** మండలంలోని వేమవరం గ్రామంలో కాపు ఉద్యమ నేత దివంగత వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని గ్రామస్తులు గతంలో ఏర్పాటు చేసుకున్నారు . ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వంగవీటి మోహన రంగ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న మాచవరం ఎస్సై సతీష్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కాపు నాయకులు కొలగాని శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం తెలిపారు.

# పంపకాలు వాళ్లకు, నిందలు చంద్రబాబుకా : ఎమ్మెల్యే జీవీ





### శావల్యాపురంలో ఎమ్మెల్యే జీవీ 'ప్రజా దర్బార్'లో వినతుల వెల్లువ

**శావల్యాపురం, మేజర్ న్యూస్ :** దుర్మార్గులకు దుర్మార్గమైన ఆలోచనలు వస్తాయి తప్ప మంచి ఆలోచనలు రావని శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరయ్యారు. అధికారులు చేపట్టిన ప్రజా దర్బార్‌కు అర్జీదారులు తరలివచ్చారు. స్వయంగా ఎమ్మెల్యే జీవి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో వచ్చిన తప్పులతో ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా పలువురు రైతులు ఎమ్మెల్యే జీవీ దృష్టికి తెచ్చారు. రీసర్వేలో అన్యాయం జరిగిందని,భూమి విస్తీర్ణాలు తగ్గిపోయాయని అభ్యంతరాలతో కూడిన వినతులు అందించారు. వాటిపై అధికారులు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని జీవి అధికారులను ఆదేశించారు. అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలని, సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే కారణా లను వివరించాలన్నారు. తర్వాత జరిగిన మీడియా సమావేశంలో జీవీ మాట్లాడుతూ కుటుంబంతో పాటు రాష్ట్రానికి జగన్ రెడ్డి చేసిన మోసం గురించే తెలుగు ప్రజలంతా చర్చించుకుంటున్నారన్నారు. తల్లి, చెల్లిని రోడ్డు మీదకు నెట్టివేశాడని, తమ్ముళ్లతో బాబాయ్‌నే హత్య చేయించిన మహానుభావుడు, దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. ఏ2 విజయసాయిరెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతు న్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. తల్లి, చెల్లి మీద కేసు వేయమని జగన్‌కి ఏమైనా చంద్రబాబు చెప్పారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకోవాలని అన్నారు. ఇలాంటి అసత్యప్రచారాలు చేయబట్టే ప్రజలు 151 సీట్లు ఉన్న వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసి ఈ గతి పట్టించారన్నారు.ఇంటి గొడ వలు నాలుగు గోడల మధ్య మాట్లాడుకోవాలని, లేకుంటే పంచాయితీ పెట్టుకుని పరిష్కరించుకోవాలని హితవు పలికారు. దోపిడీలో జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి అంతర్జాతీయ నేరగాడు చార్లెస్ శోభరాజ్‌ను మించిపోయారని, ఆయనకు ఏ గతి అయితే పట్టిందో అంతకన్నా ఘోరమైన పరిస్థితి జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డికి పడుతుందన్నారు. లక్ష కోట్లకుపైగా దోచుకున్నారు కాబట్టే 16 నెలలు జైలులో ఉండొచ్చారని, సీబీఐ దర్యాప్తు పూర్తయితే జగన్‌రెడ్డి, విజయసాయి రెడ్డి జీవితాంతం జైలులోనే ఉంటారన్నారు. ఇదే సమయంలో సరస్వతీ పవర్ ఇండస్ట్రీస్ పేరుతో పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి, రైతుల నుంచి కారుచౌకగా భూములు కొట్టేశారని,ఇంత వరకూ పరిశ్రమ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. సరస్వతీ పరిశ్రమ కోసం మోసం చేసి రైతుల నుంచి తీసుకున్న భూములను వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు.ఆనాడు జగన్‌రెడ్డి పాలనలో పరిశ్రమలు పారిపోతే ఈరోజు లోకేష్ ఇతర దేశాలకు వెళ్లి పరిశ్రమలు తీసుకొస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో 20 లక్షలమంది యువతకు ఉద్యోగాలు కల్పించబోతున్నామని,దీపావళి అయిన ఒకటిరెండు రోజులకే మెగా డీఎస్సీ రాబోతోందని, లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపబోతోందన్నారు. 16,347 పోస్టులతో కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీకి నవంబర్‌లో నోటిఫికేషన్ రాబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ ఆనందంగా దీపావళి పండుగ జరుపుకోవాలి : కమిషనర్ శ్రీహరి బాబు

**చిలకలూరిపేట మేజర్ న్యూస్ :** పట్టణ ప్రజలు ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా, అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందంగా, ఆహ్లాదకరంగా జరుపుకోవాలని చిలకలూరిపేట పట్టణ మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు అన్నారు. సోమవారం విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ దీపావళి బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకొనే వారు తప్పని లైసెన్సులు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. నిర్దేశించిన ప్రదేశంలోనే దుకాణదారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, అన్ని శాఖల అనుమతులు తీసుకోవాలని కోరారు. షాపులు ఏర్పాటు చేసిన ప్రాంతంలో షాపుకు షాపుకు మధ్య దూరం పాటించాలని, ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా ఏ ఒక్కరూ ఒక్క బాణసంచా దుకాణం నిర్వహించకూడదని హెచ్చరించారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలు తూచా



తప్పకుండా పాటించాలన్నారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్‌తో సహా అన్ని శాఖల అధికారులు సమావేశం నిర్వహించి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారని వివరించారు. ధ్వని కాలుష్య నియంత్రణకు ప్రజలు కృషి చేయాలని, తగిన భద్రతా చర్యలు తీసుకుంటూ సంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

# జగన్ చీకటిపాలన రహస్యాలన్నీ త్వరలోనే ప్రజల ముందుకు

### కుక్కపల్లివారిపాలెం, మైదవోలులో అభివృద్ధి పనులకు ప్రత్తిపాటి శంకుస్థాపన

**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అయిదేళ్ల జగన్ అరాచక, చీకటి పాలన రహస్యాలన్నీ త్వరలోనే ప్రజల ముందుకు రాబోతున్నాయన్నారు చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. అక్రమార్జన కోసం, అడ్డగోలు నిర్ణయాల కోసం అర్థరాత్రులు తెచ్చి, ఇంతకాలం గోప్యంగా దాచిపెట్టిన ప్ర తి ఉత్తర్వు జనం ముందు పెట్టబోతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన జీవోలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో జగన్ రెడ్డి అరాచకాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు పారదర్శక పాలనకు బీజం వేసినట్లు అవుతోందన్నారు. చిలకలూరిపేట మండలం కుక్కపల్లివారిపాలెం, యడ్లపాడు మండలం మైదవోలులో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన చేశారు. కుక్కపల్లివారిపాలెంలో



రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, మైదవోలులో రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన 5 ఏళ్లు అధికారంలో ఉండి ఇచ్చిన జీవోలు ప్రజలకు చిక్కకుండా దాచిపెట్టుకున్న ముఖ్యమంత్రి బహుశా జగన్ ఒక్కడే అయి ఉండొచ్చని దుయ్యబట్టారు. తెలుగుదేశం గత ప్రభుత్వ హయాంలో కూడా క్రమం తప్పకుండా జీవోలన్నీ ఆన్‌లైన్‌లో ఉంచేవారమని, జగన్ రెడ్డి వచ్చిన తర్వాత 2021 నుంచి మాత్రం ఆ సంప్రదాయానికి మంగళం పాడారన్నారు. చివరకు రాష్ట్ర హైకోర్టు చీవాట్లు పెట్టినా, జీవోలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టాలని ఆదేశించినా, రహస్య పాలననే కొనసాగించారని అన్నారు ఎమ్మెల్యే ప్రత్తిపాటి. అయిదేళ్ల పాటు అంతా మంచే చేసి ఉంటే, ప్రజలకు మేలు చేసి ఉంటే జీవోలను కూడా ఎందుకు దాచిపెట్టుకోవాల్సి వచ్చిందో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సమయం కూడా ఆసన్నమైందన్నారు. 2021 నుంచి 2024 మధ్య దాదాపు మూడే ళ్లపాటు జీవోలన్నీ దాచేశారని, అంత గోప్యం ఎందుకు పాటించాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం





- పోలీస్ అమరవీరుల సంస్మరణ సందర్భంగా ఉచిత రక్తదాన శిబిరం
- రక్తదాన శిబిరాని ప్రారంభించిన పల్నాడు జిల్లా ఎస్పీ

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినదనియమని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పల్నాడు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాంపౌండ్ నందు రక్త దాన శిబిరాని రెడ్ క్రాస్ సెంటర్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిదిగా హాజరైన పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రక్తదాన శిబిరంలో పోలీస్ సిబ్బంది అందరూ రక్తదానం చేస్తున్నారని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ కూడా ఇటువంటి కార్యక్రమాలను ఎన్నో చేస్తుందని గతంలో కూడా రెడ్ క్రాస్ భాగస్వామ్యంతో అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించామని చెప్పారు. భవిష్యత్తులో కూడా రెడ్ క్రాస్ సహకారంతో అనేక సేవ కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరం వలన ఆపదలో ఉన్న వారికి రక్తం ఉపయోగపడు తుందని సంతోషాన్ని వ్యక్తపర్చారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందికి ఎస్పీ శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గత మూడు సంవత్సరాల నుండి రక్తదానం శిబిరాలు నిర్వహిస్తున్నారు. పోలీసు వారు ముందుకు వచ్చి రక్త దానం చేయడం అనేది చాలా ఆనందకరమైనటువంటి విషయమని చెప్పారు. 24/7 విధి నిర్వహణలో ఉండే ఒకే ఒక్కరు పోలీస్ శాఖ అని కొనియాడారు. పోలీసులు సరైన విధులు నిర్వహించడం వలన సామాన్య ప్రజలైనటువంటి మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని తెలిపారు. మన వృత్తులు మనం స్వేచ్ఛగా చేసుకుంటున్నామని అందువలన మనమందరం పోలీసులకు రుణపడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందికి నా తరఫున రెడ్ క్రాస్ సొసైటీ తరఫున ధన్యవాదాలు తెలియ జేస్తున్నానని డాక్టర్ జగన్మోహనరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 51 మంది పోలీస్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలోజిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పివిఎం శరత్ బాబు, కోశాధికారి గంద్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తుల మురళి, డాక్టర్ రహమతుల్లా, గెల్లి వీరారెడ్డి, జి. వి. ఎస్ రాము, పుట్టి సాంబశివరావు, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ వైద్యాధికారి మురళీధర్, ఏ.ఎస్. పి. జెవి సంతోష్, ఎస్బి ఇన్స్పెక్టర్ సురేష్, డి.ఎస్.పి మహాత్మా గాంధీ, ఆర్. ఐ వెల్ఫేర్ సి గోపీనాథ్, ఆర్ .ఐ అడ్మిన్ రాజా, ఆర్ ఐ. (ఎం టి ఓ) కృష్ణ, ఆర్. ఐ. డి .ఎస్. డబ్ల్యు యువరాజు, వైద్య విధాన పరిషత్ బ్లడ్ సెంటర్ ఇన్చార్జ దయానిధి, రెడ్ క్రాస్ నోడల్ బ్లడ్ బ్యాంక్ విజయవాడ వారు, మాజీ కౌన్సిలర్ మస్తాన్ వలి, పోలీస్ సిబ్బంది, రెడ్ క్రాస్ సిబ్బంది, రెడ్ క్రాస్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

## షర్మిలను విమర్శించే అర్హత విజయసాయిరెడ్డికి ఎక్కడ ఉంది?

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం రాధాకృష్ణ



**చిలకలూరిపేట మేజర్ న్యూస్ :** రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అనుకూలంగా రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమీప బంధువైన విజయసాయిరెడ్డి షర్మిలను విమర్శించ టమా అని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం రాధాకృష్ణ ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి షర్మిను విమర్శించడం ఆకాశం మీద ఉమ్మి వేయడమేనని గమనించాలని అన్నారు. చంద్రబాబు నాయుడు మేనల్లుడు నందమూరి తారకరత్న అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలోను, మరణానంతరం రోజులపాటు తారకరత్న కుటుంబ సభ్యులైన చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకులతో మమేకమైన, సన్నిహితంగా మెలిగిన విజయ సాయి రెడ్డా షర్మిలను విమర్శించేది అని రాధాకృష్ణ ప్రశ్నించారు. రాయలసీమ సంస్కృతిలో చెల్లెళ్ళ కోసం ప్రాణాలు ఇచ్చే అన్నలు ఉన్నారు కానీ జగన్ రెడ్డి లాగా చెల్లిని, జన్మనిచ్చిన తల్లిని కోర్టు మెట్లు ఎక్కించే వారు ఉండరని రాయలసీమ ఆడపడుచులు భాధపడుతున్నారని అన్నారు చిన్నాన్న కూతురైన ఒక చెల్లి తన తండ్రిని హత్య చేసిన వారి మీద పోరాడుతుంటే సహకరించని, స్వయంగా రక్తం పంచుకు పుట్టిన చెల్లిని ఆస్తుల పేరుతో ఇబ్బందులు పాలు చేయడం సమంజసం కాదని పెద్దలుగా వారించవలసింది పోయి జగన్ రెడ్డికి మద్దతుగా షర్మిలను, దివంగత వైయస్సార్ సతీమణి విజయమ్మను విమర్శించడం ఎంతవరకు సమంజసమో వారే గ్రహించాలని రాధాకృష్ణ అన్నారు.

## ఆర్పీలను విధుల్లోకి తీసుకోవాలని ఎమ్మెల్యేకి వినతి



**చిలకలూరిపేట మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మెప్మా మరియు వెలుగు యానిమేటర్ల యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్నిఅందచేయడం జరిగినది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షురాలు, సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జి కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా చిలకలూరిపేట మున్సిపాలిటీలో మెప్మా శాఖలో ఆర్పీలుగా పని చేస్తున్నటువంటి కొంత మందిని తొలగించిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావటం జరిగింది. మెప్మా శాఖలో ఆర్పీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకున్నటువంటి మహిళలకు ఉపాధి లేకుండా తొలగించడం వల్ల వారు వారి కుటుంబం సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడతారని అన్నారు. కాబట్టి మున్సిపాలిటీ మెప్మా శాఖలో తొలగించిన కొంత మంది ఆర్పీలు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు మున్సిపల్ అధికారులతో మాట్లాడి రెండు రోజులలో అందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బొంతా భగత్ సింగ్, మెప్మా ఆర్పీల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోతులు, కుక్కలతో బెంబేలెత్తుతున్న మండల ప్రజలు



**ఈపూరు మేజర్ న్యూస్ :** మండలంలో పలు గ్రామాల్లో కోతులు,కుక్కలు ఎక్కువై గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. ప్రధానంగా కోతులు వలన వేసిన పంటలను నాశనం చేసి నష్టపరుస్తున్నాయి. పొలాలలో పంటలను నాశనం చేస్తూ ప్రజలపై ఎగబడుకరుస్తున్నాయి. పంటలు పెట్టుబడి ఎక్కువయ్యి ఒకపక్క దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతు కోతులు బెడదతో నష్టపోతున్నామని వాపోతున్నారు. మండలంలో కూరగాయలు పండించాలంటేనే రైతులు ముందుకు రావడం లేదు. ఇటీవల ఈపూరు ఎస్సీ కాలనీలో కుక్కలు నలుగురిపై దాడి చేసి గాయపరిచాయి ఇటువంటి సంఘటనలు అనేక గ్రామాలలో జరుగుతున్నప్పటికీ అధికారుల స్పందన కరువైంది. అదేవిధంగా గ్రామంలో చిన్నపిల్లలు బజార్లకు రావాలంటే కుక్కలు, కోతులు వెంట పడుతూ భయపెడుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా బజారుకు పంపించాలంటే ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. రోడ్డుపై వెళుతున్న మోటార్ సైకిళ్లను వెంబడించి భయభ్రాంతులకు గురిచేసి ప్రమాదాలకు కారకాలవుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు.ఇప్పటికైనా అధికారుల స్పందించి కోతులు కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని వేడుకుంటున్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** పట్టణంలో సోమవారం జరిగిన వివాహ మహొత్సవ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక రాధా - సుందర కల్యాణ మండ పంలో గుడిపల్లి వెంకట సీతారామాంజనేయప్రసాద్ కుమారుని వివాహం జరిగింది. అదే విధంగా శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో గాధంశెట్టి రామకృష్ణ కుమారుడు డాక్టర్ ఆదిత్య వివాహం జరిగింది. ఈ రెండు వివాహ మహొత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వధూవరులను ఆశీర్వాడించారు. అయన వెంట వైఎస్ఆర్సిపి నాయకులు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పొనుగోటి వెంకటరావు, పచ్చవ రవి, సత్యనారాయణరెడ్డి, అంజిరెడ్డి, చితిరాల గురుపెద్దన్న, నిడమానూరి సురేంద్ర, కొత్తూరు కిషోర్, అత్తులూరి శ్రీకృష్ణ తదితరులు వున్నారు.

## బాధ్యతలు స్వీకరించిన చంద్రకళ



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా నూతన విద్యాశాఖ అధికారిణిగా యల్.చంద్రకళ సోమవారం బాధ్యతలు స్వేకరించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ అరుణ్ బాబును మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్చాని అందజేశారు.

## శావల్యాపురం తహశీల్దార్‌గా సుజాత



**శావల్యాపురం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండల నూతన తహశీల్దారుగా కె.సుజాత నియమితు లయ్యారు. ఇప్పటివరకు బాపట్ల జిల్లాలో తహశీల్దారుగా ఆమె విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇంచార్జ తహశీల్దారుగా డిప్యూటీ తాసిల్దార్ వేముల వెంకట నాగరాజు అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి దుస్సాలువ తో సత్కరించారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కసరత్తు



**శావల్యాపురం, మేజర్ న్యూస్ :** విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల విద్యాధికారి జవ్వాజి నటరాజ్ తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, కేటగిరి-2, విద్యుత్ మీటర్లు, వీధిలైట్లు, మంచినీటి పథకాలకు స్మార్ట్ మీటర్లు అమర్చే పనులు జరుగుతున్నా యన్నారు. స్మార్ట్ మేటర్ అమల్లో కిరాగానే, ఫోన్ రీఛార్జ్ లాగా రీఛార్జ్ పద్ధతి వస్తుందని, బ్యాలెన్స్ అయిపోగానే ఇంట్లో విద్యుత్ సరఫరా ఆగిపోతుందని, మల్ల రీఛార్జ్ చేస్తేనే ఇంట్లోకి విద్యుత్ వస్తుందని ఆయన తెలియజేశారు.మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 520 స్మార్ట్ మీటర్లు మంజూరు కాగా ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సముదాయాలకు అమర్చినట్లు ఆయన తెలియజేశారు. కేవలం సేవల్యాపురం గ్రామంలోనే 212 స్మార్ట్ మీటర్లు మంజూరు ఉన్నట్లు ఆయన తెలియజేశారు.

## పేద బాలుడి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



**చిలకలూరిపేట మేజర్ న్యూస్ :** ఆపదలో ఉన్న వారికి చేయూత అందించాలని ఇన్నర్‌వీల్ క్లబ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలోని రైయిన్‌బో ఆసుపత్రిలో సీరియస్ కండిషన్‌లో చికిత్స పొందుతున్న పేద బాలుడు శివసాయికృష్ణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 45వేలను వైద్య ఖర్చుల నిమిత్తం బాలుడి కుటుంబ సభ్యులకు చెల్లించారు. ఈ సందర్బంగా గట్టు సరోజిని మాట్లాడుతూ బాలుడి విషయం తెలియగానే క్లబ్ సభ్యులు స్పందించి ఆర్థిక సహాయం అందజేశారని, వారి సహకారంతోనే ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.స్నేహం, సేవా అనే దృక్పథంతో ఇన్నర్‌వీల్ క్లబ్ పని చేస్తుందని, గతం నుంచి కష్టకాలంలో అవసరంలో ఉన్న ఎంతో మందికి సహాయ సహకారాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శి జయలక్ష్మి, క్లబ్ పూర్వ అధ్యక్షురాలు రమాదేవి, సాదినేని లక్ష్మి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది కలగకుండా మద్యం షాపులు నిర్వహించాలి




**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** పట్టణంలో మద్యం షాపులు ప్రజలకి ఇబ్బంది కలగకుండా 100 మీటర్లు దూరంగా ఉండాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఆ జీవో ప్రకారం మద్యం షాపులు నిర్వహించు కోవాలని సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ అన్నారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పట్టణంలో కొన్నిచోట్ల ఇళ్ల మధ్యలో వైన్స్ షాపులు ఏర్పాటు చేసారన్నారు. అట్టి వైన్స్ షాపులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎక్సయిజ్ పోలీసులు దృష్టి సారించి అటువంటి మద్య షాపులు గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్కడైతే ఇబ్బంది కలుగుతుందో అక్కడ ప్రజలందరినీ సమీకరించి సిపిఐగా ఆందోళన చేస్తామని వైదన వెంకట్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐఎస్ఎఫ్



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ఉమ్మడి గుంటూరు జిల్లాలోని విద్యార్థినీ విద్యార్థులకు విద్యా వసతి విద్యా దీవెన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలంటూ చిలకలూరిపేట ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు విడుదల కాక ఫీజులు కట్టలేని విద్యార్థులను పరీక్షలకు ప్రైవేట్ కళాశాలలు అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక మొత్తంలో ఫీజులు వసూళ్లకు పాల్పడుతు న్నారని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఉపాధ్యాయులను అరకొరగా నియమించుకొని విద్యా బోధన చేస్తున్నారని చెప్పారు. కొన్ని పాఠశాలలు అనుమతులు ఒకచోట తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా తరగతి గదులను మరొకచోట నిర్వహిస్తున్నారని దీనిపై కూడ కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు. పై సమస్యలపై వెంటనే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సాయి నాయక్, మధు, హేమంత్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ముప్పాళ్లలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ నేరుగా ప్రజలచెంతకు రానున్నారు. మంగళవారం ముప్పాళ్ళ మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరగనుందని తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వర రావు తెలిపారు. శాసనసభ్యుల సమక్షంలో ప్రజల సమస్యలను నేరుగా స్థానిక అధికారులకు, ఉన్నతా ధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే సదవకాశం ఉందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సమస్యల్ని పరిష్కరించడంలో భాగస్వామ్యం కావలసిందిగా బత్తుల నాగేశ్వరరావు కోరారు.

## తొలగించిన వివోఏలను విధుల్లోకి తీసుకోవాలి

**- సిఐటియు నాయకులు డిమాండ్**




**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజకీయ వేధింపులలో భాగంగా తొలగించిన విఓఏ లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి హనుమంత రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు విఓఏ లతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ కు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హనుమంత రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా వ్యాప్తంగా 600 మందికి పైగా వివోఏలను నిర్దాక్షిణ్యంగా తొలగించారని వీరిలో 100 మందికి పైగా కోర్టును ఆశ్రయించగా కోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని అయినప్పటికీ ఏపిఎం లు పట్టించుకోకపోవడంతో న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**పరిశీలించి న్యాయం చేస్తాం...డి.ఆర్.డి.ఏ పిడి బాలు నాయక్**

కలెక్టరేట్ ప్రాంగణంలో విఓఏ లను కలిసిన డి.ఆర్.డి.ఏ పిడి బాలు నాయక్ సిఐటియు నాయకులతో విఓఏలతో మాట్లాడారు. కోర్టు ఉత్తర్వులు విఓఏ ల వినతులు పరిశీలించారు. త్వరితగతిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తెలకపల్లి శ్రీను, అధిక సంఖ్యలో వివోఏ లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్య పరిష్కార వేదికకు 77 ఫిర్యాదులు

## ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పి శ్రీనివాసరావు





**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 77 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లాలోని పోలీసు అధికారులకు తెలిపారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు.

– క్రోసూరు గ్రామానికి చెందిన కేదారి చంద్రశేఖర్ యొక్క పూర్వీకులు ఉమ్మడిగా వచ్చిన ఆస్తిలో వారి భాగమును అనగా వారి యొక్క ఇల్లును సాయిబాబా గుడి కమిటీకి చెందిన ప్రతాపరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, వెంకట్రావు అనువారలు కొని, వారు కొన్న స్థలమునకు ఆనుకొని ఉన్న ఫిర్యాదు యొక్క ఇల్లును ఆక్రమించాలనే ఉద్దేశంతో గొడవలు పెట్టుకుని, ఫిర్యాదిని ఫిర్యాది భార్యను, అతని కొడుకును బెదిరిస్తూ, బూతులు తిడుతూ అమ్మిన దానికంటే ఎక్కువ స్థలమును ఆక్రమించాలని చూస్తున్నట్లు దాని పై చర్య తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు.

– నరసరావుపేట పట్టణానికి చెందిన చోడవరపు ప్రత్యూషకు 2022వ సంవత్సరంలో హైదరాబాదుకు చెందిన చోడవరపు సాయి సంతోష్ చైతన్యతో వివాహమైనట్లు, వివాహం సమయంలో రూ. 17 లక్షల రూపాయలు నగదు, 250 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి సామాగ్రి ఇచ్చినట్లు, ఇంటి సామాన్లకు గాను 2,50,000/- ఫిర్యాదు తల్లిదండ్రులు అత్తమామలకు ఇచ్చినట్లు, బెంగుళూరు నందు కాపురం పెట్టిన తర్వాత ఫిర్యాదిని తన భర్త, అత్తమామలు అందరూ కలిసి అధిక కట్నం గురించి శారీరకంగా మానసికంగా హింసిస్తున్నారంటు ఫిర్యాదు చేశారు.

– పిడుగురాళ్ల మండలం పాటి గుంతల గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలి పిడుగురాళ్ల పట్టణంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నందు హౌసింగ్ లోన్ 6,30,000/- తీసుకోనగా నెలకు 1820 రూపాయలు కట్టు లాగా ప్రతి నెల కట్టుచుండగా ఫిర్యాది ఒక నెల వ్యాపారం సాగక అక్టోబర్ నెలలో కట్టవలసి ఉన్న కిస్తీ కట్టలేదు. అందుకు లోన్ కట్టించుకునే ఏజెంట్ అయిన కంపా శ్రీను వచ్చి ఇంట్లో అందరితో అమర్యాదగా ప్రవర్తించి ఇంటికి తాళం వేస్తాను అంటూ దౌర్జన్యంగా మాట్లాడి కొంచెం గడువు ఇప్పిస్తే కడతాను అన్న కూడా వినకుండా ఇబ్బందులు పెడుతున్నాడని ఫిర్యాదు ఇవ్వడం జరిగింది.

– రాగిపెంట కోటేశ్వరి భర్త అయిన చిన వెంకట రామిరెడ్డి ఆన్లైన్ లో జూదం ఆడుతూ అప్పులు చేస్తూ ఫిర్యాదిని హింసిస్తున్నాడు. తన గురించి ఎవరికైనా చెబితే ఆత్మహత్య చేసుకుంటానని కోటేశ్వరిని బెదిరిస్తూ పుట్టింటి వారు పెట్టిన ఆస్తిని అమ్మి ఇవ్వాలని కోటేశ్వరుని పుట్టింటి వద్ద వదిలివేసి అతను తీసుకురమ్మని లేదంటే కాపురం చేయనని ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇబ్బంది పెడుతున్నందుకు గాను న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేయడం జరిగింది.

– నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన మందాది జ్యోతి భర్త అయిన తిన్నాను ఆమె పెద్ద మామ కుమారులు అయినా మందాది ప్రభుదాస్ అనే అతను ఇబ్బందులకు గురిచేయుచున్నాడని అందువలన మందాది జ్యోతి భర్త అయిన చిన్న ఇంటికి కూడా రాకుండా భయపడుతున్నాడని మందాది జ్యోతిని కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కావున ఈ విషయమై ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది.

– నరసరావుపేట మండలం మొలకలూరు కి చెందిన చింతిరాల బాజమ్మ నరసరావుపేట పట్టణంలోని ఫైవ్ స్టార్ ఫైనాన్స్ నందు హౌసింగ్ లోన్ 3,50,000 తీసుకోగా సదరు ఫైనాన్స్ వారు 40 వేల రూపాయలు తగ్గించి ఇచ్చినట్లు లోన్ మొత్తం 3,50,000/- రూపాయలు చెల్లించగా సదరు ఫైనాన్స్ వారు ఇంకా డబ్బులు కట్టాలని ఒత్తిడి చేస్తూ ఫిర్యాదుకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకున్నారంటూ ఎస్పీని కలిసి న్యాయం చేయవలసింది గా అర్జీ ఇవ్వడమైనది.

– గురజాల పట్టణానికి చెందిన కన్నె కంటి జ్యోతి కుమారుడు తన ఫ్రెండ్స్ వద్ద డబ్బులు తీసుకున్నట్లు ఆ డబ్బుల విషయమై తన కుమారుడు నాలుగు రోజుల నుండి కనబడకుండా పోయినట్లు,కావున తన కుమారుడి స్నేహితులు కిడ్నాప్ చేసి ఉంటారనే అనుమానంపై తనకు న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

# షర్మిలపైన విషం చిమ్ముతున్న జగన్ : అలెగ్జాండర్




**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** కనీసం ప్రతిపక్ష హోదా కూడా సాధించలేని జగన్మోహనరెడ్డి వ్యతిగత కక్షతో దివంగత నేత వై.ఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ వారసురాలైన ఏపీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిలకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అక్కసుతో షర్మిలపైన ఆమె తల్లి విజయమ్మల మీద దావాల రూపంలో విషం చిమ్ముతున్నారని పల్నాడు జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ మరో పక్క తన తండ్రిని చంపించింది ఒకనాడు 2010లో సోనియా గాంధీ మీద మరియు రిలయన్స్ అధినేత అంబానీ మీద ఆరోపణలు చేసి వారి షాపింగ్ మాల్స్ ను పగల కొట్టించి ఈ రోజు సీఎం నారా చంద్రబాబు నాయుడుపైన జగన్ నిరాధారమైన నిందలు వేస్తూ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఐదు సంవత్సరాలు సిఎంగా ఉన్నప్పుడు తన తండ్రి మరణం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. సునితమ్మ లాగ కోర్టు ద్వారా తండ్రి మరణము గురించి న్యాయ పోరాటము చేయ వచ్చు గదా అని ప్రశ్నించారు. కేంద్రంలో మోదీ రాష్ట్రంలో మీరు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు సీబీఐ దర్యాప్తు ఎందుకు చెపించలేదు? హత్య కేసుకి లిమిటేషన్ లేదు మీ న్యాయ కోవిదుడు పొన్నవోలు చేత ప్రయివేటు కంప్లైంట్ దాఖలు చేయించి నిగ్గు తేల్చవచ్చు కదా అని ప్రశ్నిచారు. ఎందుకు జగన్ మెదలకుండా వున్నారన్నారు. మీకు అవసరము అయినప్పుడల్ల తండ్రి మరణాన్ని వాడటమ చాల దుర్మార్గమన్నారు. ఆ విషయాలు వైఎస్ఆర్ అభిమానులు గుర్తించాలని షర్మిలమ్మ నీ కాంగ్రెస్ నీ బలపరచి వైఎస్ఆర్ ఆశయాల కొరకు నిలబడాలని కోరారు. కాబట్టి ఇటువంటి అనాలోచితమైన వ్యాఖ్యలు, నీచమైన రాజకీయాలు మంచిది కాదన్నారు. మొన్న జరిగిన ఎన్నికలలో ప్రజలు ఓడించి బుద్దిచెప్పినా కూడా కుక్క తోక వంకర అన్నట్టుగా జగన్ ప్రవర్తన ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీదా కృష్ణ రావు, రాఘవరపు శ్రీనివాసరావ్, మొలత్రాటి ప్రవీణ్, సత్యం, దేవానంద్, ప్రసాద్, ప్రేమ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని వెంటాడుతున్న నాటి జగన్ పాపాలు

- ట్రూఅప్ ఛార్జీలపై ఈఆర్సీ ప్రతిపాదన జగన్ ప్రభుత్వం చేసిన పాపమే
- మండిపడ్డ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

"ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి... తన రాక్షస పాలనతో ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం అయిన సంగతి తెలిసిందే. అధికారం నుంచి దిగిపోయిన కూడా జగన్‌రెడ్డి చేసిన పాపాలు రాష్ట్ర ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. 2022-23లో అధిక ధరకు బహిరంగ మార్కెట్లో ఎడాపెడా విద్యుత్ కొనడంతో రూ.6,072.86 కోట్ల అదనపు ఛార్జీల భారాన్ని ప్రజలు మోయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇంధన సర్దుబాటు ఛార్జీల కింద ఆ మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేసుకునేందుకు డిస్కంలకు అనుమతిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) గత శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మొత్తాన్ని ఈ ఏడాది నవంబరు నుంచి 15 నెలల పాటు వసూలు చేయాలని డిస్కంలను ఆదేశించింది. ఈ ప్రకారం 2026 జనవరి వరకు ఈ భారాన్ని ప్రజలు భరించాల్సి రావడం బాధాకరం. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదించిన వీటీపీఎస్, కృష్ణపట్నం మూడో యూనిట్ దర్మల్ విద్యుత్ కేంద్రాలను నాటి జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో డిస్కంలు బహిరంగ మార్కెట్లో అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేశాయి. ఆ భారం ఇప్పుడు ప్రజలపై పడింది." అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సోమవారం గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో



మోహనకృష్ణ మాట్లాడుతూ... విద్యుత్ ఛార్జీల పెంపుపై మాట్లాడే కనీస అర్హత నీకు ఉందా? అంటూ నిలదీశారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీని నీకు అప్పగిస్తే వ్యక్తిగత స్వార్థంతో నాశనం చేసింది నువ్వు కాదా?. నీ అసమర్థ పాలన, అస్మదీయులకు దోచిపెట్టింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఐదేళ్ల నీ దరిద్రపు పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి, ప్రజల నడ్డి విరిచిన నువ్వు, విద్యుత్ ఛార్జీల గురించి మాట్లాడుతున్నావా? ఈఆర్సీ తాజాగా చేసిన ప్రతిపాదన నీ పాపం కాదా..? తల్లికి అన్యాయం చేసినట్టు, 5 ఏళ్ళు ప్రజలతో ఆడుకున్నావ్. నీ పాపాలు, శాపాలుగా మారి ప్రజలను వెంటాడుతున్నాయి. ఈ సర్దుబాటు ఛార్జీల పాపం కచ్చితంగా నీ దరిద్రపు పాలనదే. విద్యుత్ హెచ్చుతగ్గులతో ఏపీ జెన్కోని నాశనం చేసింది నువ్వు కాదా? పీపీఏలను రద్దు చేయడం. ఉత్పత్తిదారులను భయపెట్టడంతో కేంద్ర, విదేశీ బ్యాంకుల వద్ద రాష్ట్రం పరువు తీసింది నువ్వు కాదా? అంటూ మండిపడ్డారు. 2022-23, 23-24 ఇంధన సర్దుబాటు ఛార్జీలను ప్రజలపై మోపాలని డిస్కంలకు అనుమతి ఇచ్చింది నువ్వు కాదా జగన్? డిస్కంలు విద్యుత్ ఛార్జీల పెంపుకు ఈఆర్సీ అనుమతి కోరింది నీ హయాంలో కాదా? అని నిలదీశారు. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల రక్తం తాగిన జగన్మోహన్‌రెడ్డా, చంద్రబాబు పాలనను విమర్శించేది? నువ్వు చేసిన తప్పిదాలతోనే కదా అనవసరంగా హిందూజా పవర్‌కు రూ.1200 కోట్లు కట్టాల్సి వచ్చింది? అని మోహనకృష్ణ ప్రశ్నించారు. ఏపీ జెన్కో లో విద్యుదుత్పత్తిని తగ్గించి, జగన్‌రెడ్డి బినామీ కంపెనీల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేశారు. విద్యుత్‌ను అధిక ధరలకు కొనుగోలు చేసి, దోచుకున్నది జగన్‌రెడ్డి ముఠా. మార్కెట్‌లో యూనిట్ రూ.3-4కి దొరుకుతుంటే, యూనిట్ రూ.12 పెట్టి మరీ తమ బినామీల నుంచి విద్యుత్ కొని దోచుకున్నారు. కేవలం విద్యుత్ కొనుగోళ్లు మాత్రమే కాకుండా బొగ్గు కొనుగోళ్ల వ్యవహారం అంతా కూడా రహస్యంగా జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి నడిపించారు. నాటి సైకో జగన్ అనుసరించిన విద్యుత్ విధానాల పాపమే నేడు ప్రజల మెడకు చుట్టుకుంది. పాపాలన్నీ జగన్ అండ్ కో చేసి కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారు. ఇప్పుడు ఏమీ తెలియని నంగనాచిలా జగన్‌రెడ్డి కబుర్లు చెప్తున్నాడు. అంటూ మోహనకృష్ణ ధ్వజమెత్తారు.

# స్నేహం - మొహం మధ్య తేడాపై పిల్లలకు అవగాహన కల్పించాలి : వన్ టౌన్ సీఐ





**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** నేటి సమాజంలో చిన్న వయస్సులోని పిల్లలకు స్నేహం-మొహం మరియు అందుకు సంబందించిన భావాలు సహజంగా ఎదురవుతూ వుంటాయని ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు ఈ ఆశాలపైన తమ పిల్లలకు అవగాహన కల్పిచటం అత్యంత ముఖ్యమని నరసరావుపేట ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ యం.వి చరణ్ అన్నారు. స్థానిక ప్రకాష్ నగరలోని తిలక్ మున్సిపల్ ప్రాధమికోన్నత పాఠశాలలో సోమవారం వన్ టౌన్ సీఐ యం. విజయ్ చరణ్ ఆధ్వర్యంలో పిల్లల భద్రత అవగాహన- తక్కువ వయస్సులో మెహం, స్నేహం మరియు పారిపోవటం వలన కలిగే సమస్యలపైన ఫోక్సో చట్టం (పిల్లలపై లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం) బి.ఎస్.ఎస్ చట్టంపైన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్ చరణ్ మాట్లాడుతూ పిల్లలతో తల్లిదండ్రులు ప్రతిరోజూ మాట్లాడుతూ వారి భావాలను అర్థం చేసుకొని ఒక సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. పిల్లల స్నేహాలను ప్రోత్సాహించటంలో స్నేహం మరియు మెహం మధ్య తేడాను అర్థం చేసుకునేలా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలకు ఎప్పుడైన ఏదయినా సందేహం వచ్చినపుడు వారికి స్నేహ పూర్వకంగా తల్లిదండ్రులు స్పందించి మార్గనిర్దేశం చేసి ప్రోత్సాహించాలని చెప్పారు. పిల్లలు తమ భావాలను గౌరవించుకోవాలన్నారు. ఏదయినా అనుమానస్పద పరిస్థితి ఎదురయితే నమ్మకమైన పెద్దవారితో పంచు కోవాలని తెలిపారు. పిల్లలకు స్నేహ మనేది వారి జీవితంలో మంచి అనుభూతిని ఇస్తుందన్నారు. చిన్న వయస్సులో మొహం వల్లన నిర్ణయాలు తీసుకోవటంతో చదువుకు అంతరాయం కలగటంతో పాటు కుటుంబానికి బాధలు కలుగుతా యని వివరించారు. పిల్లల భద్రత వారి మంచి భవిష్యత్తు మనందరి చేతుల్లో ఉండన్నారు. మన మందరం కలిసి సానుకుల వాతావరణంలో పిల్లలను రక్షించుకుందామని సీఐ విజయ్ చరణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లో ఎండిఎంను తక్షణమే అమలు చేయాలి : ఏఐఎస్ఎఫ్

**వినుకొండ మేజర్ న్యూస్ :** స్థానిక శివయ్య భవన్ నందు అఖిల భారత విద్యార్థి సమాఖ్య వినుకొండ నియోజకవర్గ నిర్మాణ మహాసభను నిర్వహించు కోవడం జరిగింది . మహాసభకి ముఖ్య అతిథిలుగా సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బుదాల శ్రీనివాస్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యారంగా సమస్యలు పరిష్కారం విద్యార్థుల పోరాటం వల్లే జరుగుతుందని . దేశ స్వాతంత్రం లో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని , 89 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని పోరాటాలు కొనసాగిస్తూనే ఉందని అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు



విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తుందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్య విధానాం వలన అనేక మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాఠశాల విద్యకు దూరమవుతున్నారని ఈ విధానానికి వ్యతిరేకంగా వినుకొండ నియోజకవర్గంలో పోరాటాలు నిర్వహించాలని అన్నారు. రాష్ట్రం లో సుమారుగా 70 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు జీవో నెంబర్ 77 వలన ఉన్నత పీజీ విద్యకు దూరమవుతున్నారని. గతంలో యువగళం పాదయాత్రలో నేడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ జీవో 77ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట మీద నిలబడి విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్స్ కు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మటిక్ ఛార్జీలను విడుదల చేయాలని అన్నారు. అనంతరం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పెద్దేటి అభిషేక్, బోధనం శ్రీనివాస్, మరొక 30 మంది సభ్యులతో నియోజకవర్గ సమితిని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## అచ్చమ్మ భౌతికాయాన్ని సందర్శించిన గోపిరెడ్డి



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** రొంపిచర్ల మండలం అచ్చయ్య పాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ కోటేశ్వరరావు మాతృమూర్తి అచ్చమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం అచ్చయ్యపాలెం గ్రామంలో మృతి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు రామ కోటేశ్వరావు మాతృమూర్తి అచ్చమ్మ భౌతికాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళి అర్పించారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట రొంపిచర్ల మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాస్ రెడ్డి, రొంపిచర్ల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పచ్చవ రవి, గెల్లి కోటిరెడ్డిలు పాల్గొన్నారు

## పాత కక్ష్యల నేపథ్యంలో మద్యం మత్తులో వ్యక్తి హత్య

**మాచర్ల/దుర్గి మేజర్ న్యూస్ :** పాత కక్ష్యల నేపథ్యంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన దుర్గి మండలంలోని అడిగొప్పల గ్రామంలో చోటుచేసుకుంది.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడిగొప్పుల గ్రామానికి చెందిన చికెన్ కొట్టు నిర్వాహకుడు సైదా(28),జానీ, పెరుగు శివ అనే ఈ ముగ్గురు వ్యక్తులు స్నేహితులు.వారి మధ్య స్వల్ప తగాదాలు ఉండడంతో సోమవారం గ్రామంలోని గుట్ట మీద సెంటర్లో సైదా,జానీలు కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో సైదా పెరుగు శివను తిట్టినట్టుగా జానీ ఫోన్ చేసి చెప్పడంతో శివ ఆగ్రహంతో గుట్టమీదకు వచ్చి కత్తి తీసుకుని పోవడంతో సైదా కుప్ప కూలాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతునికి భార్య షమీనా,ఇద్దరు కుమార్తెలు కుమారుడు ఉన్నారు.భార్య ఫిర్యాదు మేరకు దుర్గి ఎస్సై సుధీర్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నాగేశ్వరరావుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట మేజర్ న్యూస్ :** చిలకలూరిపేట మండలం, వేలూరు గ్రామానికి చెందిన ఆలూరి నాగేశ్వరరావు మృతి చెందగా, సోమవారం స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి



నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, టిడిపి, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తెలుగుదేశ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న శాసన సభ్యులు కన్నా



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్ టాక్సీ స్టాండ్ వారి ఆధ్వర్యంలో. ఏర్పాటుచేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తలారా! తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి ఒక్కరూ రూ.100తో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోండి. 5 లక్షల వరకు ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్యా, ఉద్యోగ, వైద్య సహాయం అందుతుంది. దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ఘన చరిత్ర మన తెలుగుదేశం పార్టీది. సభ్యత్వం తీసుకోండి.. టిడిపి కార్యకర్తను అని ఘనంగా చాటండి. ఈ కార్యక్రమంలో వివిధ హెూదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారికి శుభాకాంక్షలు తెలిపిన ఎంఈఓ సంఘ నాయకులు



**గుంటూరు ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించిన సి.వి. రేణుక ను ఎం ఈ ఓ సంఘ నాయకులు ఆర్.వి. సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు ఏ. తిరుమలేష్ ఆధ్వర్యంలో పలువురు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన డీఈవో సి.వి. రేణుక మాట్లాడుతూ జిల్లాను విద్యారంగంలో రాష్ట్ర స్థాయిలో ముందు వరుసలో ఉంచడానికి మనందరం సమిష్టి కృషి చేయాలని, దానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. పాఠశాలలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ డి.ఐ ఎం.డి. ఖాసిం, ఎం.ఈ.ఓ లు శంకర్రావు, ఖుద్దూస్ మరియు విజయ భాస్కర్, వివిధ మండలాలకు చెందిన ఎం.ఈ.ఓ లు మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## చట్ట పరిధిలో ఫిర్యాదులు పరిష్కరించాలి: ఎస్పి



**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో వున్న కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం) కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సోమవారం నిర్వహించారు. గుంటూరు కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. స్వీకరింపబడిన ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించ వలసిందిగా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయవలసిందిగా ఎస్పీ సూచించారు. జిల్లా పోలీసు కార్యలయంలో ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, నకిలీ పత్రాలు, ప్రేమ పేరుతో మోసం, మరియు చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పి రమణమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి సుబ్బారావు, సిసిఎస్ డిఎస్పి శివాజీ రాజు, నేరుగా ఫిర్యదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డి ఎస్ పి సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ సి ఐ రాంబాబు, ఇంచార్జ్ సిఐ శ్రీనివాసరావు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి కందుల దుర్గేష్ కు అభినందనలు



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా ఇన్చార్జి మంత్రిగా నియమతులై తొలిసారిగా గుంటూరు విచ్చేసిన రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ కు ప్రత్తిపాడు నియోజ కవర్గ శాసనసభ్యులు డా.బూర్ల రామాంజనేయులు సోమవారం స్వాగతం పలికి అభినందనలు తెలియజేసినారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు నాగేశ్వరరావు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగు క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం లభించాలి

## పవర్ లిఫ్టర్ ను అభినందించిన తులసి ధర్మచరణ్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే తెలుగు క్రీడాకారులు, అథ్లెట్ లకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహాలు అందచేసి వారి ప్రతిభకు తోడుగా నిలవాలని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ కోరారు. తెనాలి మండలం కటేవరం గ్రామానికి చెందిన పవర్ లిఫ్టర్ నాగం జ్ఞాన దివ్య ఈ నెల 4 నుంచి 13 వరకు దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశం తరపున నాలుగు కాంస్య పతకాలు సాధించటం పట్ల ధర్మచరణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవర్ లిఫ్టర్ నాగం జ్ఞాన దివ్యను ధర్మచరణ్ అభినందించి, సత్కరించారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ తెలుగు మహిళా క్రీడాకారులు చాలా అరుదుగా క్రీడల్లో రాణిస్తున్నారని, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న పవర్ లిఫ్టర్ నాగం జ్ఞాన దివ్య లాంటి వారికి మరింత ప్రోత్సాహాలు అందచేస్తే అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. పవర్లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ లో అంతర్జాతీయ స్థాయిలో నాలుగు పతకాలు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందని, ఇలాంటి వారిని ప్రోత్సహించడం మన బాధ్యత అని తెలిపారు. పవర్ లిఫ్టర్ నాగం జ్ఞాన దివ్యకు



గతంలో పలు సార్లు అర్థిక తోడ్పాటును అందచేశానని, భవిష్యత్ లో కూడా తాను పాల్గొనబోయే ఛాపియన్ షిప్ లకు తన అవసరాలకు తగ్గట్టుగా ఆర్థికపరంగా అండగా ఉంటానని ధర్మచరణ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన దివ్య కుటుంబసభ్యులు, కోచ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.వి.ఆర్ & జె.సి ప్రొఫెసర్ శ్రీకృష్ణకు అవార్డు



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐ ఎస్ టి ఈ) నుండి బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్ 2023 – స్టేట్ అవార్డు తమ కళాశాల అధ్యాపకురాలు ప్రొఫెసర్ డా. ఏ. శ్రీ కృష్ణకు లభించడం గర్వకారణమని ఆర్.వి.ఆర్ & జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. ఐ.ఎస్.టి.ఈ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అవార్డుల ఎంపికలలో వచ్చిన అభ్యర్థులను స్క్రీనింగ్ జరిపిన పిదప, విద్యా బోధనా మరియు వివిధ పరిశోధనలకు గానూ ఆర్.వి.ఆర్ & జె.సి ఇంజనీరింగ్ కళాశాలలో గత 30 సంవత్సరాల నుండి అధ్యాపక వృత్తిలో విధులు నిర్వహిస్తూ కళాశాల ఐ టి విభాగ ప్రొఫెసర్ అండ్ విభాగాధిపతిగా వున్న డా. ఏ. శ్రీ కృష్ణ ను ఐ.ఎస్.టి.ఈ ఆంధ్ర ప్రదేశ్ సెక్షన్ "బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్" అవార్డుకు ఎంపిక చేసి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ ను ఐ. ఎస్. టి. ఈ. చైర్మన్ ప్రొఫెసర్ జి. రంగ జనార్ధన్, హానర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి.ఈశ్వర రెడ్డి చేతుల మీదుగా ఆమెకు అందించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ & జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల సెక్రటరీ & కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ డా. ఏ శ్రీ కృష్ణ ను అభినందించి అధ్యాపక వృత్తి లో డా.ఏ శ్రీ కృష్ణ ఇతర అధ్యాపక బృందానికి స్ఫూర్తి దాయకమని తెలుపుతూ, ఆమె కృషిని కొనియాడారు. బోధనతో పాటుగా, విద్యా రంగంలో నిత్యం మారుతున్న టెక్నాలజీని అందుకొంటూ, పరిశోధనలకు అనువైన సౌకర్యాలను తమ కళాశాల అధ్యాపక బృందానికి అందిస్తూ, వారికి తగిన ప్రోత్సాహకం తమ కళాశాల యాజమాన్యం అందిస్తుండడం ద్వారానే ఇటువంటి ప్రతిష్టాత్మక అవార్డులు సొంతమవుతున్నాయని కళాశాల ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్& డి డైరెక్టర్ డా: కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ & అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, కళాశాల వివిధ విభాగా ధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం డా. ఏ. శ్రీ కృష్ణ ను అభినందించారు.

## పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం పై కమిషనర్ ఆగ్రహం

### శానిటేషన్ కార్యదర్శి సస్పెన్షన్ కు ఆదేశం..



గుంటూరు, కార్పొరేషన్ మేజర్ న్యూస్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉండేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే నగరంలో 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేస్తున్నా కొందరు నిర్లక్ష్యంగా ఉంటున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పండరీపురం, అశోక్ నగర్ ప్రాంతాల్లో సోమవారం పారిశుధ్య పనులను పరిశీలించి, అసహనం వ్యక్తం చేశారు. పండరీపురం 2, 3 లైన్లు పరిశీలించి, రోడ్ల మీద గార్బేజ్ కుప్పలు ఉండడం, డ్రైన్లలో మురుగుపారుదల లేకుండా ఉండడం గమనించి, పారిశుధ్య పనులపై స్థానికుల ఫిర్యాదులను తీసుకొని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్న స్థానిక శానిటేషన్ కార్యదర్శి ఎం.రాజకుమారిని విధుల నుండి సస్పెండ్ చేయాలని సిఎంఓహెచ్ ని ఆదేశించారు. గత 10 రోజుల నుండి నగర పరిశుభ్రత కోసం 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టడం, ప్రత్యేక పర్యవేక్షణకు సీనియర్ అధికారులను కేటాయించడం వంటి చర్యలు తీసుకుంటూ, టెలి కాన్ఫరెన్స్, క్షేత్ర స్థాయి పర్యటనల్లో పారిశుధ్య పనులపై కార్మికులు, కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లకు అవగాహన కల్గిస్తున్నప్పటికీ కొందరిలో మార్పు రావడం లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యదర్శులు మరింత భాధ్యతగా విధులు నిర్వహించాలని, ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేస్తే రోడ్ల మీద వ్యర్థాలు ఉండవన్నారు. కమర్షియల్ సంస్థలు రోడ్ల మీద వ్యర్థాలు వేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలన్నారు. అశోక్ నగర్ మెయిన్ రోడ్ ని పరిశీలించి, వీధి దీపాల సమస్య పై ఫిర్యాదులు అందుతున్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిఈఈని, భవన నిర్మాణ సామాగ్రి రోడ్ల మీద, డ్రైన్ల మీద వేయకుండా చూడాలని ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం శంకర్ విలాస్ ఆర్ఓబి మార్కింగ్ ని అరండల్ పేట మెయిన్ రోడ్ లో పరిశీలించి, మార్కింగ్ వేగవంతం చేసి నివేదిక ఇవ్వాలని, అందుకు తగిన విధంగా సిబ్బందిని కేటాయించుకోవాలని ఏసిపిని ఆదేశించారు. అనంతరం అరండల్ పేట మెయిన్ రోడ్ లో శంకర్ విలాస్ ఆర్ఓబి మార్కింగ్ ని పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ కళ్యాణ రావు, ఏసిపి రెహ్మాన్, ఎంహెచ్ఓ ఆనందకుమార్, స్పెషల్ శానిటేషన్ ప్రత్యేక అధికారి నిరంజన్, ఎస్.ఎస్. సోమశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఏ.బాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



**గుంటూరు, మెడికల్, మేజర్ న్యూస్:** సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాక్సిన్ స్టోర్స్ నుంచి అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు జిల్లా వ్యాక్సిన్ స్టోర్స్ కు సరఫరా చేసినట్లు ఇన్చార్జి డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని వెనువెంటనే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసినట్లు ఆయన వెల్లడించారు. చిన్నారులకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు బుధ, శనివారములలో జరిగే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆక్రమణ విస్తరణ పై తాసిల్దార్ కు గ్రీవెన్స్ లో ఫిర్యాదు



**పెదకాకాని, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన పెదకాకానిలోని గల సర్వే నంబర్ 905, 1బి2లో చెరువు పోరంబోకుని చెట్లును తొలగించల్లా ఆక్రమించుకొని ఓ ఆక్రమణదారుడు షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడని దానిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని ప్రస్తుతం ఆక్రమణ విస్తరించుకుంటూ పోతున్నాడని ఈ చర్యలను రెవిన్యూ అధికారులు స్పందించి అడ్డుకోవాలని ప్రభుత్వ భూమిని కాపాడాలని పెదకాకాని గ్రామానికి చెందిన దళిత నాయకులు కొంకి రామారావు సోమవారం గ్రీవెన్స్ లో తహసిల్దార్ కృష్ణకాంత్ కు ఫిర్యాదు చేశారు